# నిరసన గళం

- కాంగ్రెస్‌లో కొనసాగుతున్న టికెట్ల పంచాయితీ
- మూడు చోట్ల రెబల్స్‌గా బరిలో నిలిచే అవకాశాలు
- ప్యారాచూట్లను ఓడిస్తామంటున్న నాయకులు

ఆదిలాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ జిల్లాలో కాంగ్రెస్ టికెట్ల పంచాయితీ కొనసాగుతున్నది. ఎన్నో ఏండ్లుగా పార్టీ జెండా మోస్తూ టికెట్లు దక్కని నాయకులు తమ నిరసన గళం వినిపిస్తున్నారు. ఇప్పటికే సీనియర్లు ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో అధిష్ఠానంపై నిప్పులు చెరిగారు. కాంగ్రెస్ పెద్దలు అభ్యర్థులను మార్చుకోకపోతే రెబల్స్‌గా పోటీ చేస్తామని సంకేతాలు పంపారు. అధిష్ఠానం డబ్బులకు ఆశపడి ప్యారాచూట్లకు టికెట్లు ఇచ్చిందని, వారిని ఓడగొడుతామంటూ హెచ్చరిస్తున్నారు.

### ❖ ఆర్ఎస్ఎస్ కార్యకర్తకు పనిచేసే ప్రసక్తే లేదు..



ఆదిలాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ టికెట్‌ను అధిష్ఠానం అమ్ముకున్నది. కష్టకాలంలో పార్టీ జెండా మోసిన వారిని పక్కన పెట్టి, ఆర్ఎస్ఎస్ కార్యకర్తలకు కేటాయించారు. అధిష్ఠానం నిర్ణయాన్ని నేను వ్యతిరేకిస్తున్నా. ప్రజల్లో ఉన్న సీనియర్లను కాదని ఓడిపోయే వ్యక్తికి టికెట్ ఇచ్చారు. కంది శ్రీనివాస్ రెడ్డి కార్యకర్తలకు కనీస గౌరవం ఇవ్వకుండా ఇష్టానుసారంగా ప్రవర్తిస్తారు. జిల్లా నాయకులను అల్లిగాడు, మల్లిగాడు అని సంబోధించే వ్యక్తికి ఎలా మద్దతు ఇవ్వాలి. ఎన్ఆర్ఐగా ఉంటూ పార్టీ టికెట్ కోసం బీజేపీలో చేరిన ఆయన, అక్కడ టికెట్ రాదని తెలుసుకొని కాంగ్రెస్‌లో చేరారు. డబ్బులు పోసి టికెట్ కొనుగోలు చేశారు. కష్టకాలంలో జెండా మోసిన తనతో పాటు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సుజాత, సీనియర్ నాయకులు సంజీవరెడ్డిని అధిష్ఠానం కనీసం గుర్తించలేదు.

**- సాజిద్‌ఖాన్, డీసీసీ అధ్యక్షుడు, ఆదిలాబాద్**

### ❖ కాంగ్రెస్‌లో మహిళలకు గుర్తింపు లేదు..



కాంగ్రెస్ పార్టీలో మహిళలకు గౌరవం లేదు. టికెట్ల పంపిణీ విషయంలో తీవ్ర అన్యాయం జరిగింది. ఖానాపూర్, ఆసిఫాబాద్ ఎస్టీ నియోజకవర్గాల్లో మహిళలకు టికెట్ ఇవ్వలేదు. పార్టీ మహిళలపై చిన్నచూపు చూస్తున్నది. సొంత పార్టీలో మహిళలను పట్టించుకునే కాంగ్రెస్ అధిష్ఠానం, ఇతర పార్టీల్లో మహిళల గురించి ఎలా మాట్లాడుతారు. కాంగ్రెస్ పార్టీలో 15 ఏండ్లుగా సేవ చేస్తున్నా. కష్టకాలంలో పార్టీ జెండాను మోశాను. గతంలో ఆదిలాబాద్ జడ్పీ చైర్మన్‌గా నన్ను ప్రకటించి, అభ్యర్థులు గెలువడానికి ఆర్థికంగా సాయం చేశాను. పార్టీ కార్యక్రమాలు చేస్తూ, ప్రజల సమస్యలు పరిష్కారించాను. ప్యారాచూట్ నేతలకు, డబ్బుల మూటలు ఇచ్చిన వారికి టికెట్లు ఇచ్చారు. పార్టీలో గెలిచే అభ్యర్థులను పక్కనపెట్టి ఓడిపోయే వారికి కాంగ్రెస్ అధిష్ఠానం టికెట్లు ఇచ్చింది. ఆదిలాబాద్‌లో కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆసిఫాబాద్‌లో శ్యాం నాయక్, బోథ్, ముథోల్ నియోజకవర్గాల విషయంలో ఇదే జరిగింది. దీంతో బలంగా ఉన్న పార్టీ బలహీనంగా మారిపోయింది.

**- చారులత రాథోడ్, ఉట్నూర్ జడ్పీటీసీ**

# వివేక్.. ఊసరవెల్లి..

- ఆరు సార్లు పార్టీలు మార్చిన అరుదైన రికార్డు 'గడ్డం' సొంతం
- హస్తం పార్టీని భ్రష్టు పట్టించడానికే వస్తున్నాడంటూ సోషల్ మీడియాలో వైరల్
- మరోసారి బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరిన వివేక్ వెంకటస్వామి

మంచిర్యాల, నవంబర్ 1(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలోనే నిలకడ లేని నాయకుడు ఎవరంటే తాను తప్ప మరొకరు కాదని గడ్డం వివేక్ మరోసారి నిరూపించారు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి రోజుకో పార్టీ మార్చడం, పూటకో మాట చెప్పడంలో ఆయనను మించినోళ్లు లేరని రుజువు చేశాడు. ఒక్కసారి కాదు, రెండు సార్లు కాదు.. ఏకంగా ఆరుసార్లు పార్టీలు మార్చి అరుదైన రికార్డును సొంతం చేసుకున్నాడు. రాజకీయ పబ్బం గడుపుకోవడానికి, వేల కోట్ల ఆస్తులను కాపాడుకోవడానికి ఆయన ఎంతకైనా దిగజారుతాడు. గోడ మీద పిల్లిలా ఉండి ఏ పార్టీతో తనకు లాభం జరుగుతుందో, ఏ పార్టీలో ఉంటే రాజకీయ పబ్బం గడిస్తోందో ఆ పార్టీ సంకలో దూరడం ఆయన నైజం. వ్యాపారం చేయడంలో బాగా తెలిసిన ఆయన, రాజకీయాలను వ్యాపారం చేయడంలో దిట్టగా మారిపోయారని స్వయంగా ఆయన సన్నిహితులే చెప్తుంటారు. ఇలాంటి పరిస్థితిలో బీజేపీకి రాజీనామా చేసి మరో సారి కాంగ్రెస్‌లో చేరి పరువు తీసేసుకున్నారు.

### గాంధీ ఫ్యామిలీతో.. గడ్డం బ్రదర్స్‌కు పోలికా..

వివేక్ పార్టీలో చేరిన సందర్భంగా టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి దేశంతో గాంధీ కుటుంబం ఎంత కీలకమో.. తెలంగాణకు వెంకటస్వామి కుటుంబం అంతే కీలకమంటూ వ్యాఖ్యానించారు. వాస్తవానికి గడ్డం వివేక్ తండ్రి గడ్డం వెంకటస్వామి(కాక) ఎంతో ఆదర్శమైన రాజకీయాలు చేశారు. కాంగ్రెస్‌ను విడవకుండా దేశం గర్వించదగిన దళిత నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్నారు. ఆయన మరణానంతరం వచ్చిన గడ్డం వివేక్ గానీ, ఆయన సోదరుడు గడ్డం వినోద్ గానీ కాక మార్క్‌ను అందుకోలేకపోయారు. తండ్రిలా కాంగ్రెస్ పార్టీని నమ్ముకొని లేకుండా అవసరం ఇచ్చినప్పుడల్లా, టికెట్ల కోసం పార్టీలు మారారు. 2012 వరకు కాంగ్రెస్‌లో ఉన్న వివేక్, 2013లో బీఆర్ఎస్‌లో చేరారు. ఏడాది గడవక ముందే మరోసారి కాంగ్రెస్‌లోకి వెళ్లి, తరువాత మళ్లీ బీఆర్ఎస్‌లోకి వెళ్లారు. కొన్ని రోజులకు బీజేపీలోకి వెళ్లి ఇప్పుడు మరోసారి కాంగ్రెస్ పార్టీలోకి మారారు. తమ్ముడి బాటలోనే అన్న గడ్డం వినోద్ 2018 ఎన్నికల్లో కాంగ్రెస్ టికెట్ దక్కక, బీఎస్పీలో చేరి బెల్లంపల్లిలో ఏనుగు గుర్తుతో పోటీ చేశారు. అలాంటి చరిత్ర ఉన్న గడ్డం వినోద్, వివేక్‌లు ఇప్పుడు తిరిగి పార్టీలోకి వచ్చినంత మాత్రాన.. గడ్డం బ్రదర్స్‌ను రేవంత్‌రెడ్డి ఆకాశానికి ఎత్తేశారు. కాంగ్రెస్ అంటేనే గాంధీ ఫ్యామిలీ. అలాంటి ఫ్యామిలీని అవసరం కోసం పార్టీలు మార్చే గడ్డం బ్రదర్స్ ఫ్యామిలీతో రేవంత్‌రెడ్డి ఎలా పోల్చారనేది చర్చనీయాంశంగా మారింది.

### చెన్నూర్‌కు చేసిందేం లేదు..

వాస్తవానికి గడ్డం వివేక్ ఎంపీగా, గడ్డం వినోద్ రాష్ట్ర మంత్రిగా పనిచేసినప్పటికీ చెన్నూర్ నియోజకవర్గానికి చేసిందేమీ లేదు. వారసత్వ రాజకీయ నాయకులుగా పట్టుమని పది అభివృద్ధి పనులు కూడా చేయలేదు. అందుకే ఏ పార్టీ నుంచి పోటీ చేసినా వారి తలరాతలు మారడం లేదు. అలాంటప్పుడు ఏ పార్టీ నుంచి పోటీ చేస్తే ఏంటనే వాదనలు వినిపిస్తున్నాయి. మంచిర్యాల జిల్లాలోని చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలను మరోసారి భ్రష్టు పట్టించేందుకు నిజమైన పొలిటికల్ టూరిస్టులు వస్తున్నారనే చర్చ జిల్లాలో మారుమోగిపోతోంది. మొన్నటి వరకు కాంగ్రెస్ ఆరు గ్యారంటీలు అమలు చేయడం అసాధ్యమని మాట్లాడిన వివేక్ వీడియోలు, ఏ సంవత్సరంలో ఏ పార్టీ మారారు, ఆరు సార్లు పార్టీ మారారనే క్లిప్పింగులు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. దీంతో ఉన్న పరువు కాస్తా పోయిందంటూ వివేక్ వర్గీయులు, ఆయన సన్నిహితులు వాపోయే పరిస్థితి వచ్చింది.

### చెన్నూర్ కాంగ్రెస్‌లో 'కాక'

గడ్డం వెంకటస్వామి(కాక) కుమారుడు గడ్డం వివేక్ చేరికతో చెన్నూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీలో కాక రేపుతోంది. ఈ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్‌కు సరైన అభ్యర్థులు లేక, దరఖాస్తులకు ఆహ్వానించింది. దీంతో మాజీ మంత్రి బోడ జనార్దన్‌తోపాటు డాక్టర్ రాజా రమేశ్, గోమాస శ్రీనివాస్, నూకల రమేశ్, దుర్గం అశోక్, భాస్కర్, రామిండ్ల రాధిక ఇలా దాదాపు 14 మంది దరఖాస్తు చేసుకున్నారు. చివరకు మాజీ ప్రభుత్వ విప్ నల్లాల ఓదెలు కూడా కాంగ్రెస్ నుంచి టికెట్ కోసమే ప్రత్యేకంగా కాంగ్రెస్‌లో చేరారు. కానీ.. ఇప్పుడు ఉన్న ఫలంగా వివేక్ పార్టీలోకి రావడంతో వీరందరి ఆశలు గల్లంతయ్యాయి. మిగిలిన బీజేపీలో టికెట్ కోసం వీరిలో కొందరు ప్రైవేటు మొదలు పెట్టినట్లు తెలిసింది. నల్లాల ఓదెలుసహా మరోనేత బీజేపీతో టచ్‌లోకి వెళ్లారు. మరో ఇద్దరు ముగ్గురు కాంగ్రెస్ టికెట్ ఇవ్వని పక్షంలో కాంగ్రెస్ రెబల్‌గా పోటీ చేసేందుకు సిద్ధం అవుతున్నట్లు తెలిసింది. ఉన్న కొద్ది పాటి కాంగ్రెస్ ఓటు బ్యాంక్ చీలిపోతోందని ఆ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు వాపోతున్నారు.

# గడ్డం వివేక్ రాజకీయ ద్రోహి

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ



బీజేపీ ద్రోహి, వెన్నుపోటుదారుడు వివేక్ వెంకటస్వామి అని ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

బెల్లంపల్లి, నవంబర్ 1 : పెద్దపల్లి మాజీ ఎంపీ గడ్డం వివేక్ రాజకీయ వ్యభిచారి, రాజకీయ ఊసరవెల్లి అని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి కొయ్యల ఏమాజీ తీవ్రంగా విమర్శించారు. బీజేపీకి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరిన సందర్భంగా బెల్లంపల్లి పట్టణంలోని కాంటా చౌరస్తా వద్ద బుధవారం నాయకులు సంబురాలు చేసుకున్నారు. పటాకులు కాల్చి, కొబ్బరికాయలు కొట్టారు. వివేక్ బీజేపీని వీడి కాంగ్రెస్‌లో చేరడాన్ని ప్రజా ద్రోహం, వెన్నుపోటుదారుడిగా విమర్శించారు. పన్నెండేళ్లలో అనేకసార్లు పార్టీలు మారిన ఇలాంటి రాజకీయ వ్యభిచారికి ప్రజలు గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇప్పటికే బెల్లంపల్లిలో తన అన్న వినోద్‌ను పోటీలో ఉంచగా, చెన్నూర్ నియోజకవర్గంలో తనయుడు వంశీ, ఎంపీగా పోటీలో వివేక్ నిలబడడానికి రంగం సిద్ధం చేసుకున్నారని తెలిపారు. ఆ ముగ్గురిని చిత్తుగా ఓడించాలని ఆయన ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు బొల్లెడ కేశవారెడ్డి, జిల్లా కార్యదర్శి కొయిల్కర్ గోవర్ధన్, సీనియర్ నాయకులు అజ్మీరా శ్రీనివాస్, దూది ప్రకాశ్, నర్సింగ్, శ్రావణ్‌కుమార్, సోమన్న, సత్యనారాయణ రెడ్డి, బ్రహ్మానందం, అజ్మీరా సుభాష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి సమాధానం చెప్పాలి



రాథోడ్ గణేశ్

- ఆసిఫాబాద్ కాంగ్రెస్ టికెట్ అమ్ముకున్నవ్
- అవినీతిపరుడైన శ్యాంనాయక్‌కు ఎలా ఇస్తావ్..?
- ఆయనను ఓడించేందుకైనా రెబల్‌గా పోటీచేస్తా..
- 'నమస్తే'తో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రాథోడ్ గణేశ్

కుమ్రం భీం ఆసిఫాబాద్, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పదేళ్లుగా అధికారంలో లేకపోయినా, పార్టీ సీనియర్ నాయకుడిగా కార్యకర్తలను కాపాడుకుంటూ వచ్చిన తనకు ఆసిఫాబాద్ టికెట్ ఇవ్వకపోవడంపై పీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి సమాధానం చెప్పి తీరాలని రాథోడ్ గణేశ్ స్పష్టం చేశారు. ఇంతకాలం అధికారం, అవినీతి ద్వారా కోట్ల రూపాయలు సంపాదించిన శ్యాం నాయక్‌కు కోట్ల రూపాయలకు పార్టీ ఆసిఫాబాద్ టికెట్ అమ్ముకున్నారని ఆరోపించారు. ఆయన రేపు ఎమ్మెల్యేగా ఎన్నికైతే ప్రజలను దోచుకుంటాడని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ టికెట్ విషయమై బుధవారం ఆయన 'నమస్తే తెలంగాణ'తో మాట్లాడారు.

**నమస్తే : సీనియర్ నాయకులైన మీకు కాంగ్రెస్ టికెట్ ఇవ్వకపోవడంపై ఎలా స్పందిస్తున్నారు..?**

రాథోడ్ గణేశ్ : కాంగ్రెస్ పదేళ్లుగా అధికారంలో లేకపోయినా పార్టీలోనే ఉన్నా. కార్యకర్తలను కాపాడుకుంటూ పార్టీని ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాపాడుతూ వచ్చాను. పార్టీ నాకు టిక్కెట్ ఇస్తుందని నమ్మాను. అధిష్ఠానం కూడా చివరి వరకు నాకు టికెట్ ఇస్తామని భరోసా కల్పించారు. కానీ చివరి సమయంలో పార్టీతో ఎలాంటి సంబంధం లేని ఒక అవినీతిపరుడైన శ్యాం నాయక్‌కు ఇచ్చారు. దీనిపై నాతోపాటు పార్టీ శ్రేణులు తీవ్ర అసంతృప్తితో ఉన్నాయి.

**నమస్తే : పార్టీ టికెట్ అమ్ముకున్నట్లు మీరెలా అంటున్నారు..?**

రాథోడ్ గణేశ్ : పార్టీ టిక్కెట్ అమ్ముకొని ఉండకపోతే శ్యాం నాయక్‌కు టికెట్ ఎలా వస్తుంది. ఆయన భార్య రేఖా నాయక్‌కు బీఆర్ఎస్ టికెట్ ఇవ్వలేదని తెలిసిన రోజే అంటే దాదాపు నెల రోజుల క్రితమే కాంగ్రెస్ పార్టీలో చేరిన శ్యాం నాయక్‌కు ఏం అర్హత ఉందని, పార్టీతో అతనికి ఎలాంటి సంబంధం ఉందని టికెట్ ఇచ్చారు. ఖచ్చితంగా రేవంత్ రెడ్డి ఆసిఫాబాద్ టికెట్‌ను శ్యాం నాయక్‌కు కోట్ల రూపాయలకు అమ్ముకున్నారు.

**నమస్తే : కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయాన్ని సమర్థించడం లేదా..?**

రాథోడ్ గణేశ్ : మా పార్టీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి.. శ్యాం నాయక్ వద్ద కోట్ల రూపాయలు తీసుకొని ఆసిఫాబాద్ టిక్కెట్ అమ్ముకున్నారు. దీనిని నేను ఏమాత్రమూ సమర్థించను. పార్టీ కోసం పని చేసే నా లాంటి వారికే అన్యాయం జరిగితే, ఇక సాధారణ కార్యకర్తలకు అధిష్ఠానం ఏం న్యాయం చేస్తుంది. నన్ను నమ్ముకున్న కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలి. ఆసిఫాబాద్ టికెట్ విషయంలో రేవంత్ రెడ్డి తప్పు చేశారు. నాకు ఎందుకు అన్యాయం చేశారో చెప్పితీరాలి.

**నమస్తే : మీ భవిష్యత్ కార్యాచరణ ఏమిటి..?**

రాథోడ్ గణేశ్ : రెండు రోజుల్లో గా రేవంత్ రెడ్డి నాకు సమాధానం చెప్పకపోతే కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా బరిలో ఉంటా. ఇంతకాలం ఆర్టీవో గా వాహనదారులను పీడించి, కోట్లు సంపాదించిన శ్యాం నాయక్.. రేపు ఎమ్మెల్యేగా గెలిస్తే ప్రజలను నిలువునా దోచుకుంటాడు. కోట్ల రూపాయలు పెట్టి కాంగ్రెస్ టిక్కెట్ తెచ్చుకున్న శ్యాం నాయక్, రేపు గెలుపు కోసం మరిన్ని కోట్లు ఖర్చు చేస్తాడు. వాటికి నాలుగింతలు సంపాదించుకునేందుకు నియోజకవర్గ ప్రజలను దోచుకుంటాడు. ఇలాంటి శ్యాం నాయక్‌ను ఓడించేందుకైనా నేను కాంగ్రెస్ రెబల్ అభ్యర్థిగా తప్పకుండా బరిలో ఉంటా. శ్యాం నాయక్‌ను ఓడించి తీరుతా.